# అమ్మకడుపు చల్లగా - 2

## - గొల్లపూడి మారుతీరావు



స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి పదకొండు సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తనజీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 2018 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ధారావాహికంగా అందిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**నా జీవితంలో** పదే పదే చదివిన గ్రంథం శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి 'అనుభవాలూ - జ్ఞాపకాలూను' ఎన్నిసార్లు చదివానో గుర్తులేదు. అనపర్తి, పొలమూరులో వారి ఇల్లు, రాయవరం మునసబుగారు ఇలా ఎన్నయినా మనస్సులో కదులుతాయి. అయితే ఏనాడూ ఆ ప్రాంతాలకు వెళ్ళలేదు. ఉన్నట్టుండి ఒకాయన ఫోన్ చేశారు. దుర్భా శ్రీరామమూర్తిగారు. పొలమూరు అంటే శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి ఊరులో వారి పేరిట నాకు పురస్కారాన్ని ఇస్తారని. మాటల్లో "మా యింటి ఎదురిల్లే శ్రీపాదవారి ఇల్లుసార్" అన్నారు అంతే ఇక కాదనలేదు. రాజమండ్రిలో దిగి కారులో పొలమూరు చేరాను. దుర్భా శ్రీరామమూర్తిగారు చక్కని మిత్రులు. ఆనాటి సభని నిర్వహించారు. అయితే వారింటి ఎదురుగా ఉన్న ఒకప్పటి శ్రీపాదవారి ఇల్లు ఇప్పుడు రూపురేఖలు మారిపోయి ఉంది. కేవలం అనుకోడానికి తప్ప అక్కడేమీ లేదు. అయినా రాయవరం, అనపర్తి, పంట కాలువలు అన్నీ మనస్సులో జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ తిరిగాను. ఆనాటి సభకు పెద్దలు, హితులు, నేనంటే అమితమైన అభిమానం గల ఆవంత్స సోమసుందర్ గారు పెద్ద సంచితో తన పుస్తకాల్ని తీసుకుని పిఠాపురంనుంచి వచ్చారు. నేను చదువుకున్న రోజుల్లో తెన్నేటి విశ్వనాథంగారి ఆధ్వర్యంలో విశాఖపట్నం టౌన్ హాలులో జరిగిన శ్రీపాదవారి కనకాభిషేకానికి నేను రాసిన పద్యాల మూల ప్రతిని నాకు చేర్చిన చామర్తి కనకయ్యగారు వచ్చారు. ఆయన శ్రీపాదవారి కథల మీద పరిశోధన చేస్తున్నారు. ఆయన కాలం చెయ్యగానే వారి కుటుంబీకుల దగ్గరకి వెళ్ళి ఒక ట్రంకు పెట్టెలో వారి రచనలన్నింటినీ తెచ్చుకున్నారు. వీరిద్దరూ ఆనాటి సభలో ఉన్నారు. ఆవంత్స వేదిక మీద ఉన్నారు. చాలా కారణాలకి శ్రీపాద వారి స్మారక పురస్కారం ఎంతో ఆత్మీయంగా, స్మరణీయంగా నిలిచింది.

వంగూరి చిట్టెన్ రాజుగారు నాలుగు దశాబ్దాల క్రితం అమెరికా చేరిన తెలుగు ప్రభంజనం. చాలామంది తెలుగువారు ఇప్పటికీ నాలుగు రాళ్ళు వెనకేసుకోడానికి అమెరికా చేరతారు. కొందరు వెనకేసుకున్నారు కూడా. కానీ సాంస్కృతిక ఉద్యమాన్ని ముందేసుకుని నాలుగు రాళ్ళు నష్టపోడానికి అలవాటు పడిన తెలుగువాడు చిట్టెన్ రాజు. మంచి హాస్య రచయిత. తన పుస్తకాలేకాక అమెరికాలో ఉన్న

ఎందరో తెలుగు రచయితల పుస్తకాలను ప్రచురించి, చదవడం అలవాటులేని చాలామందికి చదువు నేర్పారు. ప్రపంచమంతా అమెరికా సరే, లండన్, సింగపూర్, మెల్బోర్న్ ఇలా చాలాచోట్ల తెలుగు మహాసభలు నిర్వహించారు. ఆయన చేతులు నల్లగా ఉంటాయి. కారణం చాలాసార్లు చేతులు కాల్చుకున్నాను. నేను చాలా సభలలో పాల్గొన్నాను.

2009 ఫిబ్రవరిలో హైదరాబాదు త్యాగరాయ గాన సభలో తెలుగు మహాసభలు జరిపారు. ఆఖరి రోజున నాకు 'జీవన సాఫల్య పురస్కారం'తో సత్కరించారు. నన్నూ మా ఆవిడనీ కూర్చోపెట్టి ఘనంగా సత్కరించారు. ఆనాటి సభ, హాజరయిన సాహితీపరుల అభినందన చిరస్మరణీయం. సత్కారం మిత్రులు సి.నారాయణరెడ్డిగారి చేతుల మీదుగా జరిగింది. వంగూరి చిట్టెన్ రాజుగారు సభలో ఉన్న అందరు సాహితీపరులను వేదికమీదకి ఆహ్వానించి దంపతులకు శుభాకాంక్షలు పూలతో తెలిపేట్టు చేశారు. ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, కిరణ్‌ప్రభ సతీమణి కిరణ్, నేరెళ్ళ వేణుమాధవ్, ద్వానా శాస్త్రి, అబ్బూరి చాయాదేవి, బలభద్రపాత్రుని రమణి, చేకూరి రామారావు, వంశీరామరాజు, డి.కామేశ్వరి, అవసరాల రామకృష్ణారావు, సుధామ, పాలకోడేటి అభినందించారు. అమెరికానుంచి వచ్చిన మిత్రులు డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి ప్రసంగించారు. అదొక ఆనందకరమైన సన్నివేశం.

సత్కారాల ప్రసక్తి వచ్చింది కనుక ఇక్కడ మనసు విప్పి కొన్ని విషయాలు చెప్పాలి.

ఏనాడూ ఆయా సభల ఫోటోలుగాని, సన్మాన పత్రాలుగానీ మా యింట్లో గోడలకి ఉండవు. కారణం వాటిపట్ల గౌరవం లేకకాదు. తగిలించడం ప్రారంభిస్తే ఇంట్లో గోడలు చాలవు. కాగా 'నిన్న'టిని గోడలకి అలంకరించడానికి మనస్కరించదు. ఆలోచన, ఆదర్శం ముందు చూపుతో ఉండాలని భావన.

మా యింట్లో దొంతర్లుగా సన్మాన పత్రాలు ఉన్నాయి. ఇచ్చినవారి పట్ల గౌరవం లేకకాదు. ఎట్టి పరిస్థితులలోనూ సభలో కార్యనిర్వాహకులు ఇచ్చిన పూలచెండుని కూడా వదిలిపోను. వాళ్ళను అగౌరవపరిచినట్టు అనిపిస్తుంది. అయితే తప్పనిసరిగా కొన్నయినా షీల్డులు అలమరలకి ఎక్కుతాయి. మా యింట్లో దేవుడి గదిలో ఉన్న చిన్న చిన్న పూజా సామగ్రి కూడా కొన్ని సందర్భాలలో ఎవరెవరో ఇచ్చినవి. స్వామికి నివేదన జరిపే చిన్ని వెండిగిన్నె దగ్గర్నుంచి స్వామివరకు అభిమానుల జ్ఞాపకాలు పలరిస్తూంటాయి. ఇది అరుదైన అదృష్టంగా భావిస్తాను.

మిత్రులతో నేను సరదాగా అనే మాట: ఈ యింట్లో నేనూ, మా ఆవిడా తప్ప ప్రతీ వస్తువూ అభిమానుల ఔదార్యానికి మచ్చుతునకలేనని. ఆఖరికి 'నా 'కీర్తి'కూడా.

*(మారుతిరావుగారు ఇంతవరకే వ్రాశారు. అంతలోనే అనారోగ్యం పాలవడంతో కొనసాగించలేక పోయారు. గత పదిహేనేళ్ళుగా ఏది వ్రాసినా ముందుగా కౌముదితో పంచుకోవడం అలవాటు కాబట్టి, ఈ ప్రతిని ఇంతమాత్రమైనా భద్రపరచే అవకాశం మాకు లభించింది. విధి చిన్నచూపు చూసి ఉండకపోతే ఇంకెన్నో విశేషాలు విని ఉండేవాళ్ళం..)*

COMMENTS